క్లుప్తంగా

వైభవంగా శ్రీలక్ష్మీ హయగ్రీవ అర్చన



అర్చన చేపడుతున్న విద్యార్థులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి సన్నిధి వీధిలో ఉన్న పరకాల మఠంలో సోమవారం శ్రీలక్ష్మీ హయగ్రీవ అష్టోత్తర శతనామావళి అర్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో చైతన్యం కలిగించి వారిలో జ్ఞానాన్ని ప్రేరేపించి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అర్చకుడు పి.గోవిందరాజన్ తెలిపారు. వేద మంత్రోచ్ఛరణ నడుమ విద్యార్థులచే శ్రీలక్ష్మీ హయగ్రీవ అర్చన చేయించారు. అలాగే చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని అర్చన చేసి శ్రీలక్ష్మీ ఆశీర్వచనాలు అందుకున్నారు.

విద్యార్థినులకు అవగాహన



శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

పాకాల: పర్యావరణ రక్షిత శానిటరీ ప్యాడ్స్ మార్కెట్లో విరివిగా దొరుకుతున్నాయని వాటిని వాడడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ మారసాని విజయ బాబు తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సత్యం చారిటబుల్ ఫౌండేషన్ వారి సహకారంతో కౌమార బాలికలకు ప్యాడ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాకాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతపై శ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే కాకినాడ ఉమెన్ ఫర్ ఉమెన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రమ్యసుధ గుబ్బల ఏకో ఫ్రెండ్లీ ప్యాడ్స్ ఉపయోగాలను విద్యార్థినులకు వివరించారు. నెలసరి చుట్టూ ఉన్న మూఢ నమ్మకాలను నమ్మకూడదని, ప్లాస్టిక్ శానిటరీ ప్యాడ్స్ వాడడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహమ్మద్‌రఫీ, లయన్స్‌క్లబ్ ట్రెజరర్ నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంకు మొర



సీఎంకు సమస్యలను విన్నవిస్తున్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ: ఇంటర్నేషన్ టెంపుల్ కన్వెన్షన్ ఎక్స్‌పో ప్రారంభోత్సవానికి తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎం చంద్రబాబును కలసి వెటర్నరీ జూడాలు సోమవారం రాత్రి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. గౌరవవేతనం పెంచాలని గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని వెటర్నరీ జూడాలుతో చెప్పినట్లు సమాచారం.


జోయాలుక్కాస్‌లో 50 శాతం ఆఫర్ ప్రారంభం



ఆఫర్‌ను ప్రారంభిస్తున్న టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంక్ డైరెక్టర్ కిషోర్‌కుమార్, షోరూం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రకాశం రోడ్డులోని జోయాలుక్కాస్ జ్యువెలరీ షోరూంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫ్లాట్ 50 శాతం ఆఫర్‌ను టీటీడీ ఎంప్లాయి కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ కిషోర్‌కుమార్‌చే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ మేనేజర్ శ్రీజేష్ మాట్లాడుతూ గోల్డ్, డైమండ్స్, సిల్వర్ ఆభరణాల మేకింగ్ చార్జీలపై 50 శాతం డిస్కౌంట్ ఆఫర్ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆఫర్ మార్చి 9వ తేదీ వరకు ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకుని సరికొత్త మోడల్స్ ఆభరణాలను ఆఫర్ ద్వారా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో షోరూం అసిస్టెంట్ మేనేజర్ చలపతి, సీఆర్‌ఓ జానకీరామ్, షోరూం సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు



స్వర్ణముఖి నదీ తీరాన జరుగుతున్న ఏర్పాట్లు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు నుంచి కొత్రమంగళం వెళ్లే దారిలో స్వర్ణముఖి నదీ తీరాన ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఏకవీరా ఫౌండేషన్, సురభి గోసంరక్షణ శాల సంయుక్త ఆధ్వర్యంలో పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ నేతృత్వంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. తిరుచానూరు వైష్ణవి విద్యాలయం పక్కన ఖాళీ స్థలంలో అతిపెద్ద హోమగుండాలను ఏర్పాటు చేశారు. శివరాత్రి రోజున నిరంతరాయంగా హోమాలు, శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున భద్రత పరంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు.



కార్తీక్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

ఇండియన్ రైల్వేస్ జట్టుతో కార్తీక్



కిర్రాక్.. కార్తీక్..

- బాల్‌బ్యాడ్మింటన్‌లో సత్తా చాటుతున్న తిరుపతి రైల్వే ఉద్యోగి
- వరుసగా పతకాలు
- రెండుసార్లు స్టార్ ఆఫ్ ఆంధ్రగా ఎన్నికైన తిరుపతి రూరల్ మండలానికి చెందిన కార్తీక్
- తాజాగా ఇండియన్ రైల్వేస్ తరఫున జాతీయస్థాయి విజేతగా నిలిచిన వైనం
- విధి నిర్వహణలోనూ ప్రత్యేక ముద్ర

తిరుపతి అర్బన్: చిన్నతనం నుంచే బాల్‌బ్యాడ్మింటన్‌పై మక్కువ పెంచుకున్నాడు.. పట్టుదలతో లక్ష్యం వైపు అడుగులు వేశాడు.. పల్లె నుంచి జాతీయస్థాయి వరకు పతకాలు సాధిస్తూ రైల్వేలో ఉద్యోగం సంపాదించాడు. అంతటితో ఆగలేదు.. తనలోని క్రీడా ప్రతిభతో ఇండియన్ రైల్వేస్ జట్టుకు ఎంపికై విజేతగా నిలిచాడు. ఉద్యోగ నిర్వహణలోనూ అవార్డులు అందుకుంటూ ముందుకు సాగుతున్నాడు కార్తీక్.

ఇదీ నేపథ్యం..

తిరుపతి రూరల్ మండలంలోని కూపుచంద్రపేట గ్రామానికి చెందిన పి.లోకనాథం, లత దంపతుల కుమారుడు పి.కార్తీక్ చిన్నతనం నుంచే స్పోర్ట్స్‌పై ఆసక్తి చూపేవాడు. చురుకుగా పాల్గొనేవాడు. చిన్నప్పుడే బాల్‌బ్యాడ్మింటన్ ఆటపై ఎక్కువ ఆసక్తి పెంచుకున్నాడు. ఆ ఆసక్తినే తన లక్ష్యంగా మలుచుకున్నాడు. పట్టువదలక సాధన చేస్తూ మండల, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచాడు. ఆపై రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగాడు. ఎక్కడా తన లక్ష్యాన్ని మరువలేదు. తాజాగా ఈ నెల 6వ తేదీ నుంచి 9 వరకు ఇండియన్ రైల్వేస్ జట్టుకు సెలెక్ట్ అయి బళ్లారిలో జరిగిన సీనియర్ నేషనల్‌లో విన్నర్స్‌గా నిలిచి మన రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపుగా తీసుకొచ్చాడు.

కార్తీక్‌కు పలువురు ప్రశంసలు

చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జగన్నాథం నాయుడు, ప్రెసిడెంట్ వెంకటస్వామి, ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ జనరల్ సెక్రటరీ పి.బాలాజీ, అసోసియేషన్ సభ్యులు బాలకృష్ణం నాయుడు, హరినాథ్, జయచంద్ర, ఫయాజ్ అహమ్మద్, గోపి, లక్ష్మీనారాయణ, రాజేష్, అవినాష్, చంద్ర, జయరాం శెట్టి, కరుణాకర్, సుబ్రహ్మణ్యం, సుధాకర్, శివ, సీనియర్ క్రీడాకారులు ప్రశంసలు అందించారు.



ఈస్ట్ కోస్ట్ రైల్వేస్‌తో బాల్‌బ్యాడ్మింటన్ ఆటగాడు కార్తీక్



రైల్వే అధికారుల నుంచి డీఆర్‌ఎం అవార్డు అందుకుంటున్న కార్తీక్

కార్తీక్ సాధించిన పతకాలు

- 2010–11వ ఏడాది మధురై, తమిళనాడు వారు నిర్వహించిన సబ్ జూనియర్స్ నేషనల్స్‌లో పాల్గొని 2వ స్థానం సాధించాడు.
- 2013లో హర్యానాలో జరిగిన జూనియర్ నేషనల్స్‌లో పాల్గొని 2వ స్థానం సాధించాడు.
- 2014లో భిలాయిలో జరిగిన జూనియర్ నేషనల్స్‌లో 2వ స్థానం సాధించాడు.
- 2015–16లో మంగళూరులో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్సిటీ బాల్ బాడ్మింటన్ పోటీల్లో 2వ స్థానం సాధించాడు.
- 2017–18లో కడపలో నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్సిటీ బాల్ బాడ్మింటన్ పోటీల్లో 2వ స్థానం సాధించాడు.
- 2017–18లో బీహార్‌లో నిర్వహించిన యూత్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలో ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపికై ప్రథమ స్థానంలో నిలిచాడు.
- 2018లో హర్యానాలో జరిగిన సీనియర్ నేషనల్స్‌లో పాల్గొని 3వ స్థానం సాధించాడు.
- రెండు సార్లు స్టార్ ఆంధ్ర అవార్డును అందుకున్నాడు.
- 2018లో ఈస్ట్‌కోస్ట్ రైల్వేస్, విశాఖపట్నంలో క్రీడా ప్రతిభ ఆధారంగా ఉద్యోగం సంపాదించాడు.
- 2022లో ఉత్తమ ఉద్యోగి డీఆర్‌ఎం అవార్డును దక్కించుకున్నాడు.

ఆటను ప్రేమించడమే ఇందుకు కారణం

నేను ఎంచుకున్న బాల్ బ్యాడ్మింటన్ క్రీడను పూర్తి స్థాయిలో ఇష్టపడ్డాను. నిరంతర సాధన చేశాను. బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, నా అన్న రంజిత్ ప్రోత్సాహం అందించి ఆటలో మెలకువలు నేర్పారు. ఇదే నేను పతకాలు సాధించడానికి తోడ్పడింది. ఈ క్రీడే నాకు ఉద్యోగాన్ని కూడా అందించింది. నాలా ఈ బాల్ బ్యాడ్మింటన్ క్రీడలోకి వచ్చేవారికి సహకరిస్తూ ఉంటా.

– పి.కార్తీక్, ఇండియన్ రైల్వేస్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

23న విలీన సభ



విలీన సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్), ఐఎఫ్‌టీయూ నేతలు

తిరుపతి కల్చరల్: దేశంలో వామపక్ష పార్టీల పునరేకీకరణ ఎంతో అవసరమని, ఈ నేపథ్యంలో ఈనెల 23న విజయవాడలో ఎంబీ భవన్ ఆడిటోరియంలో నిర్వహించే రెండు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభకు రాష్ట్రవ్యాప్తంగా విప్లవ శ్రేణులు, ప్రజాస్వామిక వాదులంతా హాజరై జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో కమ్యూనిస్టుల రెండు పార్టీల విలీన సభ పోస్టర్లను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నగర కార్యదర్శి పి.వెంకటరత్నం మాట్లాడుతూ అంతర్జాతీయంగా కమ్యూనిస్టులు పీడిత ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నూతన ప్ర జాస్వామ్య విప్లవ సాధనకై సాగే మార్గంలో రెండు సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీల విలీనం ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఈ విలీన సభకు పార్టీ నేతలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నేతలు లోకేష్, విజయకుమార మోహన్, పీడీఎస్‌యూ నేత ధనశేఖర్, ఏపీ ప్రగతిశీల మహి ళా సంఘం నేతలు అరుణ, లక్ష్మీ పాల్గొన్నారు.

12 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 12 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ట్రాఫిక్ డీఎస్పీ ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించామన్నారు. అందులో మద్యం తాగి, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

వేతనం ఎప్పుడు పెంచుతారు ?

– ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన



మాట్లాడుతున్న ధనలక్ష్మి, జయచంద్ర

చంద్రగిరి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం చంద్రగిరి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సీడీపీఓ ఆఫీసు వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మినిట్స్ కాపీ హామీలు అమలు చేయాలని కోరుతూ అనేక దఫాలుగా మంత్రుల నుంచి ముఖ్యమంత్రి వరకు విన్నవించుకున్నా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ బిల్లులు, టీఏ బిల్లులు, కావెంట్, ఈవెంట్ బిల్లులు రెండేళ్ల నుంచి లేకుండా నిలిచిపోయాయని వెంటనే విడుదల చేయాలని, రానున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించాలని, గ్రాడ్యుయేట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తామని, ఇందులో అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రియదర్శిని, నాగభూషణమ్మ, వాణిశ్రీ, అమర, నవనీత, పద్మప్రియ, ఉషా రాణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పక్షోత్సవాల ముగింపు



స్వచ్ఛ పక్వాడ పక్షోత్సవాల్లో పాల్గొన్న ఎన్‌ఏఆర్‌ఎల్ అధికారులు, ఉద్యోగులు

పాకాల : స్థానిక ఎన్‌ఏఆర్‌ఎల్‌లో పక్షం రోజులు నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్షోత్సవాలు ముగిశాయని ఎన్‌ఏఆర్‌ఎల్ డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్ర తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రారంభమై పక్షం రోజులుగా స్వచ్ఛతపై అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అందులో పరిసరాల పరిశుభ్రత, గాదంకి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్వచ్ఛతపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు, అలాగే చుట్టుపక్కల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఎన్‌ఏఆర్‌ఎల్ ఉద్యోగులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బుల్లితెర తెలుగు నటుడు స్వచ్ఛత ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో శాస్త్రవేత్త, ఇంజినీర్ రవిప్రసాద్, సహాయ సంచాలకులు శ్రీనివాసగుప్తా, మల్లికామాధురి, హరివెంకటకుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

తిరుపతి తుడా: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే వినతులను వెంటనే పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 15 మంది, నేరుగా మరో 27 మంది వచ్చిన వినతులను అందించారు. నగరంలోని పలు సమస్యలపై ప్రజలు అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజినీర్లు అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై దాడి

తిరుపతి అర్బన్ : పొరపాటున ఇంటి తలుపుతట్టిన వృద్ధుడిపై కుటుంబసభ్యులు దాడి చేసిన గాయపరిచిన ఘటన వెలుగు చూసింది. వివరాలు.. సోమవారం తెల్లవారుజామున ఓ వృద్ధుడు(70) తాతానగర్‌లోని ఓ ఇంటి తలుపు తట్టాడు. దీంతో ఇంటి యజమాని జ్యోతితో పాటు ఆమె కుటుంబసభ్యులు వచ్చి ఆ వృద్ధుడిపై దాడి చేశారు. దీంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆ మేరకు తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పోలీసులు ఇంటి యజమాని జ్యోతితో పాటు వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. స్థానికులు గమనించి తీవ్రంగా గాయపడిన వృద్ధున్ని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం





విశ్వక్సేనుల వారితో ఊరేగింపుగా వెళ్తున్న అధికారులు, పుట్టమన్ను సేకరిస్తున్న అర్చక స్వాములు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో చలువ పందిళ్లు, రంగవల్లులుతో అందంగా తీర్చిదిద్దారు.

శాస్త్రోక్తకంగా అంకురార్పణ..

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం అర్చకులు ఆలయంలో పుట్టమన్ను తీసి యజ్ఞయాగాది కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు.

ఆకట్టుకునేలా అలంకరణలు..

స్వామివారి ఆలయం, పరిసర ప్రాంతాల్లో భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్, పుష్పాలంకరణలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో 9 రోజుల పాటు 3 టన్నుల పుష్పాలను వినియోగించనున్నారు.

నేడు ధ్వజారోహణం..

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు తిరుచ్చి ఉత్సవం, ఉదయం 8.15 నుంచి 8.40 గంటల మధ్య ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్‌లో మెడిసిన్ ఎక్కడ ?



మందుల కొరతపై డాక్టర్‌తో చర్చిస్తున్న రిజిస్ట్రార్, ఏఐఎస్‌ఏ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ హెల్త్ సెంటర్‌లో విద్యార్థులకు అవసరమైన మెడిసిన్స్ అందుబాటులో లేకపోవడం దారుణమని ఏఐఎస్‌ఏ అధ్యక్షుడు రంజిత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వర్సిటీ హెల్త్ సెంటర్ వద్ద ఏఐఎస్‌ఏ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్సిటీలో విద్యార్థులకు ఏ జబ్బు వచ్చినా కేవలం డోలో 650, పారాసిటమాల్ టాబ్లెట్ తప్ప ఇతర మెడిసిన్స్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు విద్యార్థులకు సరైన ట్రీట్మెంట్ చేయడం లేదని ఆరోపించారు. అనంతరం ధర్నా దగ్గరకు రిజిస్టర్ భూపతి నాయుడు చేరుకుని హెల్త్ సెంటర్‌ను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే సమస్యలపై వెంటనే స్పందించి రూ.లక్ష విడుదల చేసి విద్యార్థులకు కావలసిన మందులను వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్లు విద్యార్థులతో సత్ప్రవర్తనతో నడుచుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ కార్యదర్శి చిన్న, శ్రావణి, మల్లిక, స్నేహ రోజా, కుమారి పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాల వ్యవస్థను కొనసాగించాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రాథమికోన్నత పాఠశాల వ్యవస్థను కొనసాగించాలని ఏపీటీఎఫ్ 1938 సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుపతిలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం సాయంత్రం జీఓ నంబరు 111 ఉపసంహరణ, స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్, ఉపాధ్యాయ పోస్టుల పునర్విభజనకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తిగా, మోడల్ ప్రాథమిక పాఠశాల స్థాపనకు 45 మంది విద్యార్థులను కనీస నమోదుగా పరిగణించాలని, అంతకుమించి ప్రతి 20మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని కేటాయించాలన్నారు. మాతృభాష/ప్రాంతీయ భాషలో, ఇంగ్లిష్‌లో సమాంతర మాధ్యమాన్ని కొనసాగించాలని, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సబ్జెక్టు టీచర్లకు మండల యూనిట్‌గా తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి చంగల్రాయమందడి, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుప్పయ్య పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 54 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లి వద్ద ఉన్న సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 54మంది విద్యార్థులు ఎంపికయ్యారు. చెన్నైకి చెందిన ప్రముఖ కోర్ కంపెనీ టీవీఎస్ బ్రేక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులను వివిధ రకాలుగా పరీక్షించి వారిలో 54 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ వై.ఆనందరెడ్డి అభినందించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులతో కలసి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, డైరెక్టర్ స్వామినాథ్, భాస్కర్ పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు.

రైల్వే అధికారిపై చర్యలకు డిమాండ్



రైతుల పొలాలకు వేసుకున్న ఫెన్సింగ్‌ని పడగొట్టిన ఆశీర్వాదం రౌడీలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తమ భూములు లాక్కోవడానికి అధికారాన్ని అడ్డు పెట్టుకుని దౌర్జన్యానికి పాల్పడుతున్న రైల్వే అధికారి ఆశీర్వాదంపై చర్యలు తీసుకోవాలని అఖిల పక్షం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కుక్కలపల్లి గ్రామానికి చేరుకున్న విశ్రాంత జిల్లా న్యాయమూర్తి గుర్రప్ప నేతృత్వంలో సీపీఐ జిల్లా కార్యదరర్శి పీ.మురళి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, రిపబ్లిక్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షుడు పీ.అంజయ్య, బీఎస్పీ నాయకులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఆశీర్వాదం తన కుటుంబ సభ్యులతో కలసి కొంతమంది రౌడీలను తీసుకొచ్చి దౌర్జన్యంగా ఇక్కడ దళితులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆశీర్వాదం కొన్న డీకేటీ భూములకు పక్కనే ఉన్న కొందరు రైతులు వారి పొలాల్లో తమ సొంత ఖర్చుతో వేసుకున్న ఫెన్సింగ్‌ను ధ్వంసం చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఫలితం లేదని వాపోయారు. అతను కొనుగోలు చేసిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్టర్లకు ఇవ్వడం సరికాదు

- గ్రామ పంచాయతీల తీర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వండి
- గ్రామాల్లో రోడ్డు పనులను కాంట్రాక్టర్లకు ఇవ్వొద్దు
- వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో డీఆర్వోకు వినతిపత్రం



డీఆర్వోకు వినతిపత్రాన్ని ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

తిరుపతి అర్బన్: గ్రామ పంచాయతీ తీర్మాణాలను గౌరవిస్తూ.. పల్లె ప్రాంతాల్లో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం నిధులతో వేస్తున్న రోడ్లు పనులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులును కలిసి వినతిపత్రాన్ని అందించారు. అంతేకాకుండా ఇటీవల హైకోర్టు గ్రామీణ ప్రాంతాల్లో వేస్తున్న రోడ్లు పంచాయతీల తీర్మాణం ప్రకారమే ఇవ్వాలని ఇచ్చిన ఉత్తర్వులను తెలియజేశారు. అయినా పంచాయతీ తీర్మాణాలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్లకు అప్పగించడాన్ని తప్పుపట్టారు. కాంట్రాక్టర్లు ఇస్తే తాము న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటేశ్వర్లు, దయాకర్‌రెడ్డి, మణి నాయుడు, సారకాయలు, దివాకర్ రెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, ధనుంజయ రెడ్డి, జొన్నల గోపాలరెడ్డి, బాబురెడ్డి, పద్మనాభరెడ్డి, ప్రసాద్, మధు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

బిజీ 'ఈఓ'



తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ ఆలయాల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు వివిధ ఆలయాలకు సంబంధించిన ప్రతినిధులు వచ్చారు. అయితే ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం తరపున ఈఓ శ్యామలరావు పాల్గొన్నారు. అయితే ఓవైపు కార్యక్రమాన్ని వింటూనే మరోవైపు ల్యాప్‌టాప్‌లో ఆయన తన బాధ్యతలను నిర్వహిస్తూ ఉద్యోగంపై తన బాధ్యతను తెలిపే దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరుపతి : 99516 02971

చంద్రగిరి : 95055 17845